క్లుప్తంగా

తాజా మాజీ కౌన్సిలర్లకు సన్మానం



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని లింగాపూర్‌కు చెందిన 9, 11 వార్డులకు చెందిన పడిగే సుగుణ, కాసర్ల శ్రీనివాస్‌లను సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. ఐదేళ్లుగా ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీ కేంద్రాలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు వైద్య కల్పన, పద్మ, ఉమారాణి, జి.లలిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): పుట్టిన ఊరికి ఏదో ఒక చిన్న సహాయం చేయాలన్న సంకల్పంతో ముందుకు వచ్చి తాను చదువుకున్న పాఠశాలకు సహాయం చేయాలని నిర్ణయం తీసుకుని బహుమతులను ప్రదానం చేశారు గ్రామానికి చెందిన ఇంజమూరి దత్తాద్రి అనే పూర్వ విద్యార్థి. ప్రస్తుతం అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ సీపీఐ కార్మిక సంఘంలో చురుకైన నాయకుడిగా ఉన్నారు. తాను చదువుకున్న పాఠశాలలో విద్యార్థులందరికి సొంత డబ్బులతో బహుమతులను అందజేశారు. గ్రామస్తులందరూ ఏకతాటిపై ఉంటే తప్పకుండా గ్రామం రెవెన్యూ గ్రామం మారడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామ పెద్దలు, యువకులు దృష్టి సారించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

'వెయ్యి గొంతులు -లక్ష డప్పులు' విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు కోలా బాలరాజు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ తలపెట్టిన ఈ కార్యక్రమానికి గ్రామ, పట్టణాల నుంచి పెద్ద ఎత్తున దివ్యాంగులు తరలిరావాలని కోరారు. దివ్యాంగులు హుస్సేన్, బాల్‌రెడ్డి, వెంకన్న, సిద్ధిరాములు, సుజాత, రాజమౌళి, సాయిలు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అయ్యప్ప దేవాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని కోరుతూ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు అందజేశారు. ఫిబ్రవరి 3న కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దిన్, మాజీ వైస్ ఎంపీపీ రూపేందర్‌రెడ్డి, విండో చైర్మన్ సదాశివరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, మాజీ వీడీసీ చైర్మన్ జనగామ రాజు, గురుస్వామి దువ్వల రాజేందర్, జనగామ రాజిరెడ్డి, నడిపి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆవాస ప్రాంత బడి పిల్లలకు బహుమతుల పంపిణీ



రామారెడ్డి: ఉప్పల్వాయి ఆవాస ప్రాంత పాఠశాలలో కామారెడ్డికి చెందిన మీనాక్షి గిఫ్ట్ షాప్ యజమాని వెంకటేశం రిపబ్లిక్‌డే సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను సోమవారం ఎంఈవో ఆనందరావు అందజేశారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. ఆవాసప్రాంత బడికి పిల్లలను పంపించడం ఇతర రాష్ట్రాల నుంచి కూలీ నిమిత్తం వచ్చిన తల్లిదండ్రులపై ఉందన్నారు. చిన్నారులను పనికి పంపకుండా ప్రతి రోజు బడికి పంపాలని సూచించారు. మహమూద్, సువర్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి గోస

- అవస్థలు పడుతున్న మహిళలు
- గ్రామ పంచాయతీ ట్యాంకర్లే శరణ్యం
- పది రోజులుగా జాడలేని మిషన్ భగీరథ నీరు



పర్మళ్లలో ట్యాంకర్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న మహిళలు



మరమ్మతులకు నోచుకోని బోరుబావి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గ్రామాల్లో వేసవికి ముందే తాగునీటికి గోస మొదలైంది. గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు రాక పది రోజులు గడుస్తుంది. దాంతో రోజు రోజుకు తాగునీటి కొరత ఏర్పడి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, అధికారులు, ప్రభుత్వాలు మారుతున్నా తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపలేక పోతున్నారని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించినా అది పూర్తిస్థాయిలో అమలు కావడంలేదని ప్రజలు అంటున్నారు. లింగంపేట మండలం పర్మళ్లలో గ్రామ పంచాయతీ బోరుబావుల మోటార్లు చెడిపోయి ఎనిమిది నెలలు గడుస్తున్నా అధికారులు నిధుల కొరతతో మోటార్లను బాగుచేయలేకపోతున్నారు. పర్మళ్లలో బోరుబావులు ఉన్నా వాటిలో మోటార్లు బిగించకపోవడంతో తాగునీటికి ఇబ్బంది ఎదురవుతోంది. వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ నుంచి మూడు ట్యాంకర్లు ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నారు. కానీ కుటుంబాలకు సరిపడా నీళ్లు ఇవ్వడంలేదు. దాంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని బూరుగిద్దలో ఎనిమిదేళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అధికారులు నేటికి శాశ్వత పరిష్కారం చూపలేకపోయారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏటా తాగునీటికి తంటాలు తప్పడంలేదని వాపోయారు. మిషన్ భగీరథ నీరు వారం రోజులకు ఒకసారి వస్తున్నాయని, అవి కూడా పూర్తిస్థాయిలో రావడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు అధికారులకు వివరించినా ఫలితం లేదన్నారు. రోడ్డెక్కి రాస్తారోకో, ధర్నాలు చేశామన్నారు. అధికారులు తాత్కాలిక ఉపశమనం కోసం వేస్తున్న బోరుబావులు ఆరు నెలలకే అడుగంటిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో 16 కుటుంబాలు గత ఐదు దశాబ్దాలుగా జీవనం కొనసాగిస్తున్నారు. నేటికి తాగునీటి కొరత తీరలేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులకు సమస్య వివరించినా అటువైపు చూడడంలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. మిషన్ భగీరథ నీరు నాలుగు రోజులకు ఒకసారి వస్తున్నాయని అవి సరిపోక మహిళలు వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. పొలం గట్లపై నుంచి తాగునీరు తెచ్చుకోవడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

పొలాల నుంచి తెచ్చుకుంటున్నాం



గ్రామంలో ప్రతి ఏటా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వేసవి వచ్చిందంటే భయమేస్తుంది. వ్యవసాయ బోరుబావులకు వెళ్లి పొలం గట్లపై పడుతూ లేస్తూ నానా అవస్థలు పడుతున్నాము. వ్యవసాయ బోరుబావులు సైతం వట్టి పోతుండడంతో దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలి. – గజ్జిల్లి మానస, బూరుగిద్ద

ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు



ప్రతి రోజు ట్యాంకర్ల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. బోరుబావులు ఉన్నా వాటిలో మోటార్లు లేక నీటి కొరత ఏర్పడుతోంది. ట్యాంకరు కోసం పనులు మానుకొని రోజు వేచి ఉండాల్సి వస్తుంది. మిషన్ భగీరథ నీళ్లు ఒక్కోసారి వారం, పది రోజులు రావడంలేదు. అప్పుడు గ్రామానికి చెందిన మహిళలు అవస్థలు పడాల్సి వస్తుంది. – రావుల లస్మవ్వ, పర్మళ్ల

గొడవలు జరుగుతున్నాయి



వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదు. రోజు ట్యాంకర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నాం. ట్యాంకర్ల వద్ద గొడవలు అవుతున్నాయి. ట్యాంకర్లతో సరఫరా చేసిన నీళ్లు కుటుంబానికి సరిపోవడంలేదు. ప్రతి ఏటా అధికారులకు సమస్య మొరపెట్టుకుంటున్నాము. తమ కష్టాలు గట్టెక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – బద్ద పోచవ్వ, పర్మళ్ల

మెరుగైన విద్యనందించడమే లక్ష్యం

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న పోచారం, పక్కన కాసుల

బాన్సువాడ: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే తమ లక్ష్యమని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్, బాలికల కళాశాల, ఉర్దూ మీడియం కళాశాలల వార్షికోత్సవంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు పాఠశాలలు, కళాశాలల గదుల నిర్మాణాలు, మౌలిక వసతుల కోసం రూ.600 కోట్లు ఖర్చు చేశామని, డిగ్రీ కళాశాల వద్ద రూ.10 కోట్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ పోస్టు మెట్రిక్ కళాశాలల వసతి గృహాలు నిర్మిస్తున్నామని తెలిపారు. గతంలో ఒకే ఒక్క జూనియర్ కళాశాల ఉంటే ప్రస్తుతం 31 కళాశాలలు ఉన్నాయని, వాటిలో 17 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. జిల్లా నోడల్ అధికారి సలాం, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, ఖలేక్, దాసరి శ్రీనివాస్, విఠల్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులున్నారు.

విద్యార్థులను ఫోన్లకు దూరంగా ఉంచాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం హన్మాండ్లు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): విద్యార్థులను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని పాఠశాల హెచ్‌ఎం హన్మాండ్లు అన్నారు. సోమవారం మైలారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత తరగతుల్లో జరిగిన విషయాల గురించి అడిగి తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సవిత, ఉపాధ్యాయులు, గ్రామస్తులున్నారు.

రైతులకు అధికారులు చిక్కరు దొరకరు



మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కార్యాలయంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

బిచ్కుంద(జుక్కల్): వ్యవసాయ అధికారులు సమయపాలన పాటించడం లేదు. మండల కేంద్రంలోని ఏడీఏ కార్యాలయానికి వచ్చిన రైతులకు అధికారులు చిక్కరు దొరకరు అన్న రీతిలో కొనసాగుతున్నారు. స్థానిక ఏవో సంవత్సరం క్రితం ఫర్టిలైజర్ షాపు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కి సస్పెండ్ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి ఏవోలు కొనసాగుతున్నారు. ప్రస్తుతం పిట్లం ఏవో ఇన్‌చార్జిగా ఉన్నారు. రెగ్యూలర్ ఏడీఏ ఇంద్రసేన ఉన్నప్పటికీ కార్యాలయానికి ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఉంది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట అవుతున్నా ఒక్క అధికారి కూడా కార్యాలయానికి రాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాలకు సంబంధించి రైతులు సమస్యలతో కార్యాలయానికి వస్తున్నారు. వారికి సమాధానం చెప్పి దరఖాస్తులు తీసుకునే వారు కరువయ్యారు. అధికారులు లేకపోవడంతో చేసేదేమి లేక రైతులు వెళ్లిపోయారు.

సర్దాపూర్‌తండాలో వైద్య శిబిరం



సర్దాపూర్‌తండాలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్

సాక్షి ఎఫెక్ట్..

మాచారెడ్డి : మండలంలోని సర్దాపూర్‌తండాను సోమవారం వైద్యాధికారులు సందర్శించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్వర పీడితులకు చికిత్స చేశారు. ఈ నెల 26న 'విష జ్వరాలతో విలవిల' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తండాలో ఇంటింటికీ తిరుగుతూ జ్వరపీడితుల వివరాలు తెలుసుకున్నారు. రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబొరేటరీకి పంపించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, బాధితులతో మాట్లాడారు. కాచి వడపోసిన నీటితో పాటు వేడి ఆహారం తీసుకోవాలన్నారు. మండల వైద్యాధికారి ఆదర్శ్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

సమర శంఖారావం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే బీసీ విద్యార్థుల సమర శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌నాయక్, నాయకులు కిషన్, సందీప్, గణేష్, తదితరులున్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



బాన్సువాడ: హైదరాబాద్‌లో నేడు నిర్వహించే ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కౌసర్ పిలుపునిచ్చారు. సోమవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్(హిమాయత్ నగర్)లో నేడు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల 11వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలకు మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు హాజరవుతున్నారని చెప్పారు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు శంకర్, మహమూద్, యేశయ్య, ఫరీద్, మనోహర్, సలీం, కరీం, ఆహ్మద్ ఉన్నారు.

'పద్మశ్రీ'తో మాదిగ ఉద్యమానికి గౌరవం



కామారెడ్డి అర్బన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు కేంద్రం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించడం ద్వారా 30 ఏళ్ల మాదిగ సామాజిక ఉద్యమానికి న్యాయం చేసిందని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు పి.బాలమణి, బి.వెంకటరాములు, పి.శంకర్, ఆర్.బాగయ్య, రామస్వామి, శివరాజ్‌లు మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ తన జీవితాన్ని ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి అంకితం చేశారని, వర్గీకరణను అమలు చేయాలని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



బాన్సువాడలో తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నేతలు



బీబీపేటలో తహసీల్దార్ సత్యనారాయణకు..



ఎల్లారెడ్డిలో ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్‌కు..

కేంద్ర ఆర్థిక శాఖ తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్)ను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా సోమవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళనలకు దిగారు. సీపీఎస్‌ను రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మండలాల్లో తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రవేశ పెట్టబోతున్న యూపీఎస్ విధానంలో చేరకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని పీఆర్‌టీయూ నేతలు కోరారు. – సాక్షి నెట్‌వర్క్



రామారెడ్డిలో తహసీల్ కార్యాలయ అధికారికి..



పాల్వంచలో తహసీల్దార్ లక్ష్మణ్‌కు..



కామారెడ్డిలో తహసీల్దార్ జనార్దన్‌కు..



పెద్దకొడప్‌గల్‌లో తహసీల్దార్ దశరథ్‌కు..



నాగిరెడ్డిపేటలో తహసీల్దార్ శ్రీనివాసరావుకు..



నస్రుల్లాబాద్‌లో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు..

ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణానికి భూమిపూజ



బీబీపేట: మండల కేంద్రంలో మోడల్ హౌజ్ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఎంపీడీవో కార్యాలయం పక్కన ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మిస్తోంది. అదే పద్ధతిలో లబ్ధిదారులు సైతం నిర్మించుకోవాలని సూచించారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీవో అబ్బాగౌడ్ ఉన్నారు.

సమాచారం..

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాల్లో 2023–24లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఏపీవో సాయిలు తెలిపారు. మార్చి 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.3 లక్షల 10 వేల విలువ గల పనులు చేపట్టారని ఆయన చెప్పారు. ఈ పనులపై నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నారు.

చిన్నమల్లారెడ్డి పద్మశాలి సంఘ కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి గ్రామ పద్మశాలి సంఘం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆసం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా బత్తిని వెంకటి, ఉపాధ్యక్షుడిగా గుండ్లపల్లి మోహన్ స్వామి, ప్రధాన కార్యదర్శిగా సాప రాంబాబు, సంయుక్త కార్యదర్శులుగా బల్ల ప్రవీణ్, ఆల్లే శ్రీనివాస్, కోశాధికారిగా చౌకి వెంకట్‌రాజు, తదితరులు ఎన్నికయ్యారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం..

బాన్సువాడ : కొత్త బాన్సువాడ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పరి లింగం, ఉపాధ్యక్షుడిగా ఉప్పరి కాశీనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పరి నవీన్, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా శంకర్, సలహాదారులుగా సంగమేశ్వర్, మొగులయ్య, విఠల్, సాయిలు, రాజు, హన్మండ్లు, తదితరులను ఎన్నుకున్నారు.